41 ఏళ్లకు అ'పూర్వ' సమ్మేళనం



కోరుట్లటౌన్: రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1981–82 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు 41 ఏళ్లకు ఒక్కచోట చేరారు. కోరుట్ల మండలంలోని వెంకటాపూర్ గుట్ట వద్ద ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. 50 ఏళ్ల పైబడిన వయసులో తమ చిన్ననాటి స్నేహితులను చూసి, భావోద్వేగానికి లోనయ్యారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ముంజ ధర్మపురి గౌడ్, దాసరి గంగాధర్, పెడివెల్లి నర్సయ్య, వుశకోల సుధాకర్, బి.రవీందర్, భగవంతరావు, రవికుమార్, మురళీమోహనాచారి తదితరులు పాల్గొన్నారు.

39 ఏళ్ల తర్వాత బడికి



వెల్గటూర్: ఎండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల 1983–84 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం తాము చదివిన బడిలోనే పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. 39 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులను కలవడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ కుటుంబ క్షేమ సమాచారం తెలుసుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు, విశ్రాంత డిప్యూటీ డీఈవో ఎస్.కొండల్ రావు మాట్లాడుతూ.. అప్పటి విద్యార్థుల్లో క్రమశిక్షణ, బోధన పట్ల టీచర్ల అంకితభావం, ఇప్పటి విద్యావిధానంలో మార్పులను వివరించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

23 ఏళ్లకు.. ఒక్కచోటకు



సారంగాపూర్: మండలంలోని కోనాపూర్–పెంబట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000 పదోతరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. 23 ఏళ్ల తర్వాత జరిపిన ఈ కార్యక్రమానికి వారు చదివిన పాఠశాలే వేదికైంది. మొత్తం 57 మంది కాగా అందరూ హాజరయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలతో సందడి సందడిగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం అందరూ కలిసి భోజనం చేశారు.

క్లుప్తంగా

ముదిరాజ్ సంఘం భవనానికి రూ.5 లక్షలు



ధర్మపురి: మండలంలోని జైనా ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ రూ.5 లక్షల ప్రొసీడింగ్ కాపీని ఆదివారం అందజేశారు. కరీంనగర్‌లోని ఆయన క్యాంపు జరిగిన కార్యక్రమంలో సర్పంచు మహేశ్, లిఫ్ట్ చైర్మన్ ప్రేమ్‌చందర్‌రావు, ముదిరాజ్ నాయకులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుంత పూడ్చివేతకు చర్యలు



మెట్‌పల్లి: పట్టణ సమస్యలపై శనివారం సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించగా అధికారులు స్పందించారు. చావిడి రోడ్‌లో ఉన్న ఖబ్రస్తాన్ వద్ద భగీరథ పైపులైన్ లీకేజీ మరమ్మతు కోసం గుంతను తవ్వి వదిలేసిన విషయాన్ని మైనారిటీ నాయకుడు ఖుత్బుద్దీన్ పాషా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన వారు మిషన్ భగీరథ అధికారులకు సమస్య తీవ్రతను తెలిపి, పరిష్కరించాలని సూచించారు. దీంతో ఆదివారం అక్కడ గుంత పూడ్చివేత పనులు ప్రారంభించారు.

సాక్షి స్పందన

మటన్, చికెన్ దుకాణాల్లో తనిఖీలు



జగిత్యాలటౌన్: కోళ్లు, మేకలు, గొర్రెల వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దని బల్దియా కమిషనర్ బోనగిరి నరేష్ అన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదివారం జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని పలు మటన్, చికెన్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. కోళ్లు, మేకలు, గొర్రెల వ్యర్థాలను వాటిని సేకరించే ఏజెన్సీలకు అప్పగించాలని సూచించారు. మేకలు, గొర్రెలను స్లాటర్‌హౌస్‌లలో మాత్రమే కట్ చేయాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అశోక్, రాము, సిబ్బంది ఉన్నారు.

రూ.10 వేల ఆర్థికసాయం



మల్లాపూర్: వేంపల్లికు చెందిన ముక్కెర లక్ష్మణ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ సభ్యురాలు గుగ్లావత్ భూమి, ఉపసర్పంచ్ వెల్మల రాజనర్సయ్య, జీపీ కార్యదర్శి నరేష్, వార్డుసభ్యుడు మ్యాకల మహేశ్‌లు బాధిత కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించారు. గ్రామ పంచాయతీ నిధుల నుంచి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. మండల కేంద్రానికి చెందిన భవాని టెంట్‌హౌస్ యజమాని ముష్కరి రాకేశ్ 50 కిలోల బియ్యం అందజేశాడు.

ఎల్లమ్మ ఆలయంలో హోమం

కోరుట్ల: పట్టణంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం హోమం, ప్రతిష్ఠాపన మూర్తులకు స్నపనం, హారతి వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, కోరుట్ల రేణుక గౌడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

కోరుట్లటౌన్: పట్టణంలోని 21వ వార్డులో ఆదివారం అభివృద్ధి పనులపై సమీక్ష, ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పెన్షన్ లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ అయాజ్, కౌన్సిలర్ అన్వర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, నాయకులున్నారు.

ఇసుక చేరి.. ప్రమాదకరంగా మారి

- భారీ వాహనాల రాకపోకలతో గుంతలు
- నందగిరి–పెగడపల్లి దారిలోని వంతెనపై తరచూ ప్రమాదాలు
- భయంభయంగా ప్రయాణిస్తున్న 13 గ్రామాల ప్రజలు
- మరమ్మతు చేయాలని వేడుకోలు



నందగిరి–పెగడపల్లి దారిలో ఎస్సారెస్పీ వంతెనపై ఇసుక

పెగడపల్లి: మండలంలోని నందగిరి–పెగడపల్లి దారిలో ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాలువ వంతెనపై ఇసుక చేరి, ప్రమాదకరంగా మారింది. రోడ్డు నిర్మాణ సమయంలో ఇరువైపులా తారు వేసి, వంతెనను వదిలేశారు. దీంతో ఏటా వానాకాలంలో ఇసుక కొట్టుకువచ్చి వంతెనపై చేరుతోంది. దీంతో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. అంతేకాకుండా భారీ వాహనాల రాకపోకలతో వంతెనపై గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు కురిసినప్పుడు ఆ గుంతల్లో నీరు నిలుస్తుండటంతో వాహనదారులు భయంభయంగా ప్రయాణించాల్సి వస్తోంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెనకు మరమ్మతు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పెగడపల్లి–గంగాధరకు ఇదే ప్రధాన రోడ్డు..

గొల్లపల్లి మండలంలోని చిల్వకోడూర్, రంగదామునిపల్లి, లక్ష్మీపూర్, పెగడపల్లి మండలంలోని నంచర్ల, రాములపల్లి, వెంగళాయిపేట, దీకొండ, పెగడపల్లి, నందగిరి, అయితిపల్లి, గంగాధర మండలంలోని బూరుగుపల్లి, లక్ష్మీదేవిపల్లి, గంగాధర గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజల రాకపోకలకు ఇదే ప్రధాన రోడ్డు. పెద్ద, చిన్న వాహనాలు వంతెన పైనుంచి వెళ్లాల్సిందే. ఆర్టీసీ బస్సులతో పాటు పెగడపల్లి మండలంలోని బతికపల్లి క్వారీ నుంచి నిత్యం గ్రానైట్, ఇసుక లారీలు పదుల సంఖ్యలో వెళ్తున్నాయి. ఫలితంగా వంతెన పైభాగం అక్కడక్కడ దెబ్బతింది. నిత్యం వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ దారిలోనే వస్తూపోతుంటారు. వంతెన మరమ్మతును పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఎలాంటి ప్రమాదం జరగకముందే మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నం



వంతెన పైనుంచి వెళ్లాలంటే ప్రజలందరం ఇబ్బంది పడుతున్నం. ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనను పట్టించుకోక పోవడంతో కూలిపోతుందేమో అని భయంగా ఉంది. వంతెన పైనున్న ఇసుక కింద గుంతలున్నాయి. వరదలు వస్తే ఇసుక కొట్టుకుపోయి గుంతలు కనిపిస్తాయి.

– తపుటు గంగాధర్, నందగిరి

మరమ్మతు చేయించాలి



పెగడపల్లి నుంచి గంగాధర, అటునుంచి గొల్లపల్లి వైపు వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి. పైగా ఎస్సారెస్పీ ప్రధాన కాలువపై ఉన్న వంతెన పైనుంచే వెళ్లాల్సి ఉంటుంది. ఇసుక పేరుకుపోవడంతో వాహనాలు అదుపుతప్పి, పడిపోతున్నాయి. అధికారులు పరిశీలించి, మరమ్మతు చేయించాలి.

– బొమ్మెనగోని రాకేశ్‌గౌడ్, అయితిపల్లి

సమస్యలు వింటూ.. నోట్ చేసుకుంటూ

- 'పల్లె నిద్ర'లో భాగంగా గ్రామాల్లో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పర్యటన



కోనాపూర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్: మీరు–నేను కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు మరిన్ని తన దృష్టికి వచ్చాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పెంబట్ల, కోనాపూర్, పోచంపేట గ్రామాల్లో ఆయన పర్యటించారు. శనివారం రాత్రి కోనాపూర్ గ్రామంలో పల్లె నిద్ర చేసి, ఆదివారం ఉదయం 6 గంటలకే గ్రామాల్లో పర్యటన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికంగా ప్రజల సమస్యలు వింటూ అడుగుతూ.. నోట్ చేసుకున్నారు. కొన్నింటిని అధికారులతో మాట్లాడి, అక్కడికక్కడే పరిష్కరించారు. పెంబట్ల గ్రామంలో ఇద్దరికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.60 వేల విలువ గల చెక్కులు అందజేశారు. పోచంపేటలో గంగమ్మ తల్లి ఆలయంలో పూజలు చేశారు. ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ సభ్యుడు మేడిపల్లి మనోహర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, సర్పంచు పల్లికొండ రమేశ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడాలి

జగిత్యాలటౌన్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అరాచక పాలన సాగిస్తోందని, దానికి చరమగీతం పాడాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలనలో ప్రజల ప్రాణాలకు, దేవుడి మాన్యాలకు రక్షణ కరువైందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం కోసం నిర్మించిన యాదాద్రి ఆలయంలో వరదలు బీభత్సం సృష్టించగా, నిర్మాణంలో ఉన్న సెక్రటేరియేట్‌లో మంటలు చెలరేగాయన్నారు. కొండగట్టు పర్యటన ముగిసి, పది రోజులు గడవకముందే ఆలయ చరిత్రలోనే తొలిసారి దొంగలు పడటం భద్రతాలోపాలకు నిదర్శమన్నారు. రాష్ట్రంలో వైద్య విద్యార్థినులపై వేధింపులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్ర పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న తిరుపతి రెడ్డి

జగిత్యాలరూరల్: కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నియోజకవర్గ నాయకుడు పన్నాల తిరుపతి రెడ్డి కోరారు. అదివారం జగిత్యాల అర్బన్ మండలంలోని పెరుకపల్లిలో పార్టీ మండల ఇన్‌చార్జి జున్ను రాజేందర్ అధ్యక్షతన ప్రజాగోస–బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.20 కోట్లతో జగిత్యాల రాజీవ్ చౌరస్తా నుంచి సారంగాపూర్ మండలంలోని రంగపేట వరకు డబుల్ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు మాత్రం వారే ఆ నిధులు విడుదల చేయించినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

రాయికల్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీజేపీ జగిత్యాల అసెంబ్లీ కన్వీనర్ చిలుకమర్రి మదన్‌మోహన్ అన్నారు. ఆదివారం అల్లీపూర్‌లో నిర్వహించిన ప్రజా గోస–బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు అన్నవేణి వేణు, నాయకులు పాల్గొన్నారు.

'హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్'

పెగడపల్లి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్‌ను గద్దె దించాలని బీజేపీ జగిత్యాల, కరీంనగర్ జిల్లాల అధికార ప్రతినిధులు ఇల్లెందుల శ్రీనివాస్, సంకిటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పెగడపల్లి మండలంలోని నామాపూర్‌లో ప్రజాగోస–బీజేపీ భరోసా పేరుతో స్థానిక నాయకుడు పల్లె మోహన్‌రెడ్డి అధ్యక్షతన శనివారం రాత్రి స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు.

ఇంటి పన్ను బకాయిలు చెల్లించండి



అధికారులకు ఇంటి పన్ను చెల్లిస్తున్న ప్రజలు

కోరుట్లటౌన్: 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను బకాయిలు చెల్లించి, పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ.అయాజ్ ప్రజలను ఒక ప్రకటనలో కోరారు. మార్చి 31న ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఇంటి పన్ను, నల్లా బిల్లు, అడ్వర్టైజ్‌మెంట్, ఎంక్రోచ్‌మెంట్, లైసెన్సు ఫీజులు సంబంధిత మున్సిపల్ అధికారులకు చెల్లించాలని సూచించారు. ఇంటి పన్ను చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పన్నులు వసూలు

కోరుట్ల పట్టణంలో మున్సిపల్ అధికారులు ఆదివారం ఇంటింటికీ వెళ్లి, పన్నులు వసూలు చేశారు. కార్యక్రమంలో అధికారులు బీసీ నర్సింలు, జగదీశ్, మదన్, ఆర్ఐ శ్రీకాంత్, ఆర్వో తిరుపతి పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల గోడు సర్కారుకు పట్టదా?



మల్లాపూర్: లక్షలాది మంది గల్ఫ్ కార్మికుల గోడు సర్కారుకు పట్టదా అని ఇండియన్ పీపుల్స్ ఫోరం కో–కన్వీనర్ శరత్‌గౌడ్ ప్రశ్నించారు. ఆదివారం దుబాయిలో ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గల్ఫ్ బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఎన్‌ఆర్‌ఐ పాలసీ ప్రకటించాలని, రూ.500 కోట్లు కేటాయించాలన్నారు. గల్ఫ్‌లో చనిపోయినవారి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఏజెంట్ల మోసాలను అరికట్టాలని, గల్ఫ్ దేశాల్లోని అన్ని ఎంబసీల్లో తెలుగు అధికారులను నియమించాలని పేర్కొన్నారు. అనంతరం గల్ఫ్ కార్మికులకు భరోసా కల్పించేందుకు మార్చి 5న దుబాయికి వస్తున్న ఎంపీ అర్వింద్ స్వాగత వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఫోరం దుబాయి చాప్టర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నవనీత్, సభ్యులు పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సారంగాపూర్: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం బట్టపల్లి గ్రామంలో సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. దేశ జనాభాలో 74 శాతం బీసీలు ఉన్నప్పటికీ ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనకబాటుకు గురవుతున్నారని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీపతి రమేశ్ మాట్లాడుతూ.. జగిత్యాలలో త్వరలో నిర్వహించే బీసీ ఆత్మగౌరవ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అలిశెట్టి ఈశ్వరయ్య, జిల్లా నాయకలు దీటి వెంకటేశ్, కొక్కు ఉదయ్‌కుమార్, తిరుపురం రాంచందర్, మండలశాఖ అధ్యక్షుడు బాస నాగేందర్, ప్రధాన కార్యదర్శి పాలగాని మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ వినియోగంపై అవగాహన

పెగడపల్లి: రాజరాంపల్లిలో చొప్పదండి లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ(హెచ్‌పీ) ఆధ్వర్యంలో ఆదివారం గ్యాస్ సిలిండర్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఐదేళ్లకోసారి సేఫ్టీ పైపులను మార్చడంతోపాటు కంపెనీ ప్రతినిధులతో రెగ్యులేటర్‌ను సరిచూసుకోవాలన్నారు. గ్యాస్ సిలిండర్ పేలి వ్యక్తి మరణించినా, ఆస్తి నష్టం జరిగినా పరిహారం పొందవచ్చని ఏజెన్సీ ప్రతినిధులు నాగేందర్, శ్యాంరాజ్ సూచించారు. ఇటీవల సిలిండర్ పేలి ఓ పూరిల్లు దగ్ధమవగా బాధితుడు బండారి కనకయ్య కుటుంబానికి గ్యాస్ సిలిండర్ ఉచితంగా అందజేశారు. సర్పంచు సత్తమ్మ, ఉప సర్పంచు రాజశేఖర్‌గౌడ్ తదితరులున్నారు.

యూనిఫామ్స్ పంపిణీ



జగిత్యాలటౌన్: పట్టణంలోని శ్రీవాల్మీకి ఆవాసంలో 45 మంది విద్యార్థులకు యశస్వి ఎలక్ట్రానిక్స్ అధినేత కోటగిరి శ్రీనివాస్–మంగ దంపతుల కుమారుడు యశస్వి ఆదివారం యూనిఫామ్స్ అందజేశారు. ఆవాసం అధ్యక్షుడు పురుషోత్తం ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాయికల్: సింగరావుపేటలో జగిత్యాల పట్టణంలోని మాధవ సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సులోచన ఆస్పత్రి వైద్యులు ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, రేగుంట ప్రశాంత్‌లు 200 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. సర్పంచు రాంచందర్‌రావు, ఎంపీటీసీ సభ్యురాలు సాగరిక, నాయకులు పాల్గొన్నారు.

వీడీసీ సభ్యులపై కేసు

మెట్‌పల్లి: మెట్లచిట్టాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాంరాజ్ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన గుడేటి, మున్నూరు కాపు కులస్తులపై వీడీసీ సభ్యులు సామాజిక బహిష్కరణ విధించడంతో బాధితులు ఇటీవల ఫిర్యాదు చేశారన్నారు. దీంతో విచారణ జరిపి, 8 మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మెట్‌పల్లిలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు



మెట్‌పల్లి: పట్టణంలోని రాంనగర్ క్లబ్‌లో ఆదివారం అవినాష్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలను నిర్వహించారు. వీటిని ఎస్సై శ్యాంరాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. కటాస్, స్పారింగ్ వి భాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో జగిత్యాల, కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట, సిరిసిల్ల, జనగామ, హైదరాబాద్ జిల్లాలకు చెందిన 500 మంది క్రీడాకా రులు పాల్గొన్నారు. 300 మంది బంగారు, 100 మంది వెండి పతకాలు సాధించారని, నిజామాబాద్ క్రీడాకారులు అత్యధికంగా 170 పతకాలు గెలిచారని నిర్వాహకుడు అవినాష్ తెలిపారు. స్థానిక ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు భోజన సదుపాయం కల్పించారు.

వృద్ధుడి ఆత్మహత్య

గొల్లపల్లి: మండల కేంద్రానికి చెందిన ముస్కు నందిరెడ్డి(90) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నందిరెడ్డి భార్య భూదవ్వ 8 నెలలుగా వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇంటి వద్ద ఒక్కడే ఉంటున్న ఆయన ఒంటరితనంతో బాధపడుతున్నాడు. ఆదివారం పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు జగిత్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కోడలు సరోజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

బీమా చెక్కులు అందజేత

కథలాపూర్: అంబారిపేటలో బీఆర్‌ఎస్ కార్యకర్త లావుడ్య దేవి మృతిచెందగా ఆమె కుటుంబానికి పార్టీ తరఫున రూ.2 లక్షల బీమా చెక్కు, సిరికొండలో రైతు అమీనొద్దీన్ మృతిచెందగా రైతుబీమా కింద రూ.5 లక్షల చెక్కు అతని కుటుంబీకులకు మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి ఆదివారం అందించారు.

ఏఎల్.మల్లయ్యకు నివాళి



మల్లాపూర్: గంగపుత్రుల హక్కుల సాధన కోసం ఉద్యమించిన యోధుడు గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏఎల్.మల్లయ్య అని జిల్లా అధ్యక్షుడు దేశవేని రాజేశ్ అన్నారు. మల్లయ్య గుండెపోటుతో మృతిచెందగా ఆదివారం రాత్రి జగిత్యాల కొత్త బస్టాండ్ వద్ద, మల్లాపూర్‌లోని భరతమాత కూడలి వద్ద ఆయన చిత్రపటాలకు నివాళి అర్పించారు. గంగపుత్ర సంఘం మండల అధ్యక్షుడు న్యావనంది నడిపి నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

కోరుట్లటౌన్: గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏఎల్.మల్లయ్య చిత్రపటానికి కోరుట్ల పట్టణంలోని కార్గిల్ చౌరస్తా వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. పట్టణ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ హుండీ ఆదాయం రూ.33 వేలు

వెల్గటూర్: స్థానిక శ్రీరామ భక్తాంజనేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపు ఆదివారం నిర్వహించారు. గత ఆరు నెలలకు గాను రూ.33,825 ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు నరేష్ తెలిపారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని వెల్గటూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్ శాలువాలతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు పెద్దూరి భరత్, ప్రధాన కార్యదర్శి గుమ్ముల సతీశ్, కోశాధికారి జూపాక కిరణ్, సర్పంచు మేరుగు మురళి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గొల్ల కేతమ్మ జాతరకు విద్యుత్ సౌకర్యం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని రంగసాగర్ శివారు గొల్ల కేతమ్మ ఆలయానికి ఆదివారం విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. జాతర ఆదివారం ప్రారంభమైన నేపథ్యంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఏసీడీపీ నిధులు రూ.4.80 లక్షలు మంజూరు చేయగా విద్యుత్తు సౌకర్యం కల్పించినట్లు నాయకులు తెలిపారు. కేడీసీసీ బ్యాంక్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ హరీశ్, ఏఈ శ్రీనివాస్, సర్పంచులు బోడ స్వప్న, పర్వతం రమేశ్, చుంచు శారద, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు నారపాక రమేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా గంగాధర్



నియామక పత్రం అందుకుంటున్న గంగాధర్

గొల్లపల్లి: చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన ఏదుల గంగాధర్ యాదవ్‌ను యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సమితి జిల్లా అధ్యక్షుడు బల్కం మల్లేశ్ యాదవ్ ఆదివారం ఆయనకు నియామక పత్రం అందజేశారు.

యాదవ సంఘం గొల్లపల్లి ఉపాధ్యక్షుడిగా లచ్చయ్య

భీంరాజ్‌పల్లికి చెందిన సింగారపు లచ్చయ్య యాదవ్ యాదవ సంఘం గొల్లపల్లి మండల ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. సంఘం మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి ఆదివారం నియామక పత్రం అందజేశారు.